


# కాలమ్ దాటని కబుర్లు

## బలభద్రపాత్రుని రమణి



## నెల నెలకీ కొన్ని కులాసా కులాసా కబుర్లు

### సొసైటీ అనగానెవరు?

Man is a social animal అన్నాడు అరిస్టాటిల్, సరే, ఒప్పుకున్నాం. సొసైటీ పుట్టాక మనిషి పుట్టాడా? మనిషి పుట్టాక సొసైటీ పుట్టిందా? ఆదిమానవులు గుహల్లో, గుంపులుగా నివసించేటప్పుడే "ఇదిగో ఇది మన సొసైటీ. అది వాళ్ళ సొసైటీ" అనుకునేవాళ్ళా?

"వాడు చర్మాలు కట్టుకుంటున్నాడేవిటీ? మనం ఈకలు కట్టుకుంటుంటే? ఎంతైనా సోకులు మితిమీరిపోతున్నాయి. ఇంతింత సిగ్గులు మేమెరుగమమ్మా, మా అమ్మా అమ్మమ్మా ఒంటికి ఏం కట్టుకున్నారనీ?" అని మాట్లాడుకునేవాళ్ళా? నిప్పు కనిపెట్టి, మాంసం కాల్చుకు తింటున్న వాడిని చూసి కొత్తగా ఆ మంగమ్మగారు గేస్ కనెక్షన్ తీసుకుందిట. ఏమోనమ్మా కోరి ప్రమాదాలు కొని తెచ్చుకోవడమే ఈ నిప్పుతో చెలగాటాలు అని మన చిన్నప్పుడు అమ్మమ్మలు మాట్లాడుకున్నట్లు మాట్లాడుకున్నారా?

మాతృస్వామ్యం రోజుల్లో ఎవడైనా ధైర్యం చేసి నేను వేటకి వెళ్తాను, ఎంతకని పిల్లల్ని పెంచుకుంటూ ఇంట్లో వుండమంటావు?" అని పెళ్ళానికి ఎదురు తిరిగి రివోల్ట్ చేసి వుంటాడా? ఆమె చేతి బల్లెం దెబ్బలు తిన్నాడా?

రాతి గుహల్లో వున్న వాళ్ళకి ఎవడైనా ఈతాకులతో, తాటాకులతో పాక వేసుకుని వుండడం కనిపిస్తే, నోళ్ళు నొక్కుకున్నారా? పాకల్లో వున్న వాళ్ళ పిల్లలు, ఉన్న వాళ్ళ పిల్లల్లా ఫీలయ్యారా? ఏ సొరకాయ బుర్రలోనో తాగుతూ, ఏనుగు దంతాలతో నూరుకునే ఆవిడకి, రాత్రిపాత్రలూ, గరిటెలూ రాతితో చెక్కే వాళ్ళని చూస్తే అసూయ కలిగిందా? వీళ్ళ సొసైటీలో కన్నా ఎదుటి సొసైటీలో వాళ్ళు తెలివి మీరి. అందులో అమ్మాయి ఒకత్తి, కట్టుకున్న చర్మాల మీద ఏవైనా శంఖాలూ, ఎర్రని గింజలూ, రాళ్ళూలాంటివి మెడలో గుచ్చి వేసుకుందా? ఆడపిల్లకి వున్నంతలో సౌందర్యసాధనాలు తయ్యారు చేసుకోవడం అలవాటు కదా! అసలు పెళ్ళిళ్ళు ఏ బేసిస్ మీద జరిగేవి? వాళ్ళ ఇంట్లో అందరికీ బొచ్చెక్కువ. ఆ బొచ్చు వారి అమ్మాయిని గుండు వారికిస్తారా? అసలే ఒళ్ళంతా వాళ్ళకి బొచ్చెక్కువని మహా గర్వం అనుకునేవారేమో?

"మా సొసైటీలో పెళ్ళి, ఒక దుప్పిని అప్పిస్తారా విందు చెయ్యాలి?" అంటే "అడవి దున్నని కూడా కాల్చి విందు చేసే పరిస్థితి లేని నీకు నేను పిల్లనెలా ఇస్తానురా? మా అంతస్తు ఏవిటి? నీ అంతస్తేవిటి?" అని అనేవారా? పాకలో వాడి పిల్లని రాతి గుహలో వాడికివ్వనంటే, వారి ప్రేమకథ ఎలా ముగిసేది? అసలు అందరికీ బొచ్చు వుండేదా? కొందరికి బట్ట తలలు కూడా వుండేవా? పిల్లలు పుడితే ఏం పేర్లు పెట్టేవారు?

శ్రీదేవీ వాణిశ్రీల్లా అందంగా తయ్యారయి ఈకలు జడలో తురుముకుని, జాకెట్ లేకుండా, స్టైలుగా కాస్ట్యూమ్స్ వాళ్ళు కష్టపడి కట్టినట్లు చీరకట్టి, ఎదురుగా వున్న కృష్ణంరాజో, శోభన్ బాబో జింక చర్మం కట్టుకుని, తలకి పాము చర్మం, అందులో ఈకలూ పెట్టుకుని వుంటే దట్టమైన లిప్‌స్టిక్‌తో "కండ గెలిచింది కన్నె దొరికింది" అని పాడుతుంటే, డప్పుల డాన్సులు లయబద్ధంగా చేస్తూ "మాత పలికింది. మనువు కలిసింది" అని ఆడపిల్లలు అందుకునేవారా? అసలు ఆదివాసులూ, కోయవాళ్ళూ అంటే మన సినిమావాళ్ళకి ఎంత ఫాసినేషన్? అందమైన పర్ణశాలలూ, మట్టిపాత్రలూ, ఫలాలు, ముగ్గులేసిన ముంగిళ్ళూ.. చూట్టూ అడవి జంతువులూ ఇలా వుండేవారా? నాగరికతలేని రోజుల్లో కలర్‌ఫుల్‌గా?

అసలు సొసైటీ అంటే ఏవిటి? ఒక గుంపు మనుషులా? ఒక గుంపు ఇళ్ళ సముదాయమా? అసలు ఇన్ని పిచ్చి ఆలోచనలు నాకెందుకొచ్చాయి? నేనేం ప్లూటోనీ అరిస్టాటిల్‌నీ కానే. సామాజిక స్పృహ వున్న రచనలు చేస్తున్నాం అనే కోవలోకి కూడా రానే. మరి ఎందుకొచ్చాయి?

మా వియ్యపురాలొచ్చి, నా పదకొండునెలల మనవడు ఇంకా అడుగులు వెయ్యడంలేదు, సొసైటీలో వాళ్ళు "ఇంకా నడవట్లేదా? అంటుంటే ఏం చెప్పాలో తెలియడంలేదు" అంది.

ఇంక మొదలైంది వీడికి సొసైటీ గోల అనుకున్నాను.

"మీ అమ్మ సొసైటీలో మొహం చూపించుకోలేకపోతోందిట. వాడికి నడక లేట్ అయిందనీ" అని మా అబ్బాయి కోడల్ని ఆట పట్టించాడు. అసలు కడుపులో వుండగానే "అదేవిటీ? పదో నెలొచ్చినా ఇంకా డెలివరీ అవలేదా? ఆ కమలగారి అమ్మాయితో బాటేగా, ఆ అమ్మాయ్‌కి డెలివరీ అయి రెండువారాలు అయింది" అంటారు.

ఆ పుట్టేవాడికి ఓ పోటీదారుని సమాజం ఆల్‌రెడీ రెడి చేసి పెట్టేసిందనమాట.

"మా కొలీగ్ కొడుక్కి మూడో నెలే అప్పుడే బోర్లా పడ్తున్నాడు"

"మా బృంగి మావయ్య కొడుక్కి కూతురుగా అది అప్పుడే పాకుతోంది"

"అయ్యో మీ పక్కలో పడుకోబెట్టుకుంటున్నారా? మా అమ్మాయి తన మూడో నెలబాబుని విడిగా పడుకో పెడ్తుంది"

"మా ఫ్రెండ్ వాళ్ళమ్మాయి స్పూన్ ఇస్తే ఫారెక్స్ తనే తీసుకు తింటోంది. ఇంకా మీరు తినిపిస్తున్నారా?"

అసలు ప్రతీది పక్కవాడు త్వరగా చేసాడని చెయ్యాలా? మనపిల్లాడు పెరిగేటప్పుడు తన స్వభావం కొద్దీ చెయ్యాలా? ఇంక స్కూల్ కెళ్ళే వయసొచ్చిందంటే కంపేరిజన్‌కి మార్కెట్‌లో ప్రొడక్ట్ అయిపోతాడు పిల్లాడు.

"ఏ స్కూలూ? అరె! అక్కడ స్టార్స్ ఎక్కువలేవు. ఆ పక్క వీధిలో చిరాకు స్కూలుందిగా అక్కడ వెయ్యాల్సింది" ఇలా వుంటాయి అమ్మల కబుర్లు.

"మా వాడికి ఏ ప్లస్ వచ్చింది. మీవాడికేం వచ్చిందీ?"

"కక్కులూ, విరోచనాలూ వచ్చాయి" వాడి వయస్సెంతనీ? కిండర్ గార్డెన్‌లో ఏ ప్లస్ లూ, బి మైనెస్ లూనూ. అసలు మీవాడికి ఏం వస్తే నాకెందుకూ మా వాడికి నాలుగుసార్లు డయిపర్‌లు మార్చాము. మీవాడికెన్నిసార్లు మార్చారు? అని నేను అడిగానా?

అసలు ఈ సమాజానికేం పనివుండదా అంట. ఏ స్కూల్‌లో వేసారు? క్లాస్‌లో ఎన్నో రాంక్ వస్తోందీ? మా వాడు తబలా నేర్చుకుంటున్నాడు. పెయింటింగ్స్ వేస్తాడు. మా అమ్మాయి అన్ని కంట్రీస్ కేపిటల్స్, కరెన్సీ మూడేళ్ళకే చెప్పేస్తోంది. స్పెల్లింగ్ 'బీ' కి వెళ్ళడం.. ఇండియన్స్ మాత్రమే చేస్తారు. దానికోసం పిల్లల్ని రుద్దేస్తారు. నాకు తెలిసిన ఓ పెద్ద డాక్టర్ ఎం.డీ, ఎఫ్.ఆర్.సీ ఎస్ లండన్, ఇంకా ఎన్నో డిగ్రీలున్నాయి. ప్రతి మేజర్ టౌన్‌లో సిటీలో ఆస్పత్రులు పెట్టిన ఆంధ్ర ప్రెన్యూర్, నాకు బోత్, ఆల్‌రైట్‌లాంటివి తప్పు రాస్తున్నానేమో అనిపిస్తూ వుంటుంది. మా పల్లెటూర్లో, జిల్లా పరిషత్ స్కూల్లో తెలుగు మాత్రం బాగా నేర్పించారు" అని నవ్వుతారు. నిజమే

అవి పొరపాటైనా అతని చెయ్యి పడితే ఎంతటి సర్జరీ అయినా అలవోకగా జరిగి, రోగి తపీమని లేచి కూర్చుంటాడు. స్పెల్లింగ్స్ రాకపోతే జీవితం ఆగిపోతుందా? సింగపూర్, మలేషియా, ఇండోనేషియాలో సులభంగా Teksilఅని taxiనీ, Laby అని lobbyనీ pulisఅని police అనీ రాసుకుని బతకడంలేదా? అసలు అవతలవాడికి అర్థమైందా లేదా? అదీ మేటర్. వేలుమురుగన్ మురుకులూ, పచ్చళ్ళూ, నెయ్యీ పదహారు కంట్రీస్‌కి ఎక్స్‌పోర్ట్ చేస్తాడు "ఐ సెండింగ్ 16కేజీస్ మురుకూ. టేస్టింగ్ బిట్వీన్ బిట్వీన్ బిట్టర్ బిట్టర్ పుట్ నల్ల బట్టర్, కమింగ్ బెటర్ బెటర్" అని రష్యన్స్‌తో, కెనడియన్స్‌తో మాట్లాడేస్తాడు. అటువైపు కస్టమర్స్‌కీ చక్కగా అర్థమౌతోంది. కాన్ఫిడెన్స్ దట్ కౌంట్స్. అంతే.

మా అమ్మమ్మకీ విషయం తెలియక రెనెన్ మార్టెన్ గ్రామర్ బుక్ 'కీ' కూడా బట్టీ పట్టించేది. అసలు నాకు పెద్దగా లెక్కలు రావు. క్లాసులో లెక్కల్లో ఫస్ట్ వచ్చే రమాదేవిని చూస్తే ఒళ్ళు మండేది. అయితేనేం? నా కథ సినిమాలు తీసే నిర్మాతలు కానీ నా నవలలు ఇష్టంగా చదివే పాఠకులుకానీ ఎన్నడు నాకు లెక్కలు వచ్చా? అని అడగలేదు. ఒకవేళ ఎవరైనా అడిగినా "అయ్యా నేను తెలుగులో ఏ లిటరేచరూ చెయ్యలేదు. అసలు ఈ మధ్య ఫేస్‌బుక్ నిండా ఛందస్సుతో పద్యాలు రాసేస్తున్నారు, వాళ్ళని చూస్తే ముచ్చటేస్తోంది కానీ నేను 'యమాతరాజభానసలగం'ని ముక్కున పట్టి గణవిభజన చేసానే కానీ పద్యం రాసేంత తెలుగు పదాలు నేర్చుకోలేదు. త్రొటుపాటుని 'త్రోట్‌పాట్' అని వాడేదాన్ని. అది త్రోట్‌కి సంభందించినది కాబట్టి. అయినా తెలుగు పాఠకులు ఆదరించారు. కానీ 'ళ' అక్షరం 'శ' అక్షరం పలకడం రాయడం వచ్చు. ఎప్పుడూ గుణింతాలూ, వత్తులూ తప్పుపెట్టలేదు. పెద్ద బాలశిక్ష ఒకటో తరగతి నుండే ఆటలా నేర్చుకున్నాం. అంతేకానీ 'శిక్ష'లా ఈ చదువులేంటమ్మా. ప్రతి పిల్లాడికీ లాప్‌టాప్, మొబైల్ ఫోన్‌లో వాట్సప్ గ్రూప్, హోంవర్క్ చేసేది తల్లులూ, తండ్రులూ సోషల్లీ ప్రొడక్టివ్ వర్క్ అంటూ తల్లుల చేత ఇళ్ళూ, డాములూ, అట్టముక్కలతో కట్టిస్తే, లతలూ, చెట్లూ డ్రాయింగ్స్ వేయిస్తే పిల్లాడికేం వస్తుందా? తల్లికి నడ్డి నెప్పి తప్ప? పైగా ఈ వాట్సప్ గ్రూప్‌లో మళ్ళీ ఈ 'సొసైటీ' మనని మర్చిపోనివ్వదు. "మీ అబ్బాయి నిన్న రికార్డ్ వర్క్‌లో ఎంత స్కోర్ చేసాడు. మా అచ్యుత్‌కి వందకి వంద" అని మెసేజ్‌లు. పర్వత వర్ధినికి తన పిల్లాడి చుట్టూ ఫ్లాట్స్‌లో మిగతా పిల్లల తల్లులందరూ తిరుగుతూ "మీ పిల్లాడికి 30 మార్క్స్.. 30 మార్క్స్" అని ముక్కుమీద వేలు పెట్టి చూపిస్తున్నట్లు పీడ కలలొచ్చి, కెవ్వున అరుస్తూలేస్తుంది. గురక పెట్టి నిద్రపోతున్న మొగుడ్ని నిద్రలేపి "నీకేం గురక పెట్టి నిద్రపోతున్నావ్! వాడికి రేపు ఎమ్.సెట్‌లో సీట్ ఎలా వస్తుంది?" అంటే మొగుడు తెల్లబోతూ, నోట్లో వేలేసుకుని అమాయకంగా నిద్రపోతున్న ఐదేళ్ళ కొడుకువంకా, భార్యవంకా పిచ్చి చూపులు చూస్తాడు. వాడికి ఎమ్.సెట్ ఏంటీ? నా నిద్ర చెడగొట్టడం ఏంటీ? నీ పిచ్చి తగలెయ్య. ఆ వాట్సప్ గ్రూప్‌లకి నిప్పెట్టా" అని, నిద్రలోకి జారిపోతాడు. కానీ పర్వత వర్ధినికి మాత్రం కాళరాత్రే. నిద్రవుండదు. ఈ సొసైటీ అనేది వుంది చూసారూ. ఇది కుక్కల్ని కూడా వదిలి పెట్టడం లేదు. మా సీరియల్ హీరోయిన్ కుక్కకి ఏదో పుండుపడి యుట్రెస్ తీసేసారుట. పక్కింటావిడ వచ్చి "మీ క్యూటీకి తల్లయ్యే ఛాన్స్ లేదుగా. పాపం క్రాసింగ్‌కి తీసుకెళ్ళే పని తప్పింది" అందట. ఆ క్యూటీ మనసు గాయపడి ఆ పూట అన్నం తినలేదుట. (కుక్కల్ని పెంచేవారికి వాటి మనోభావాలు తెలుస్తాయి. మనకి తెలీవు) అక్కడినుండి ఆ అమ్మాయికి ఒకటే వర్రీ. ఫ్లాట్స్‌లో మిగతా కుక్కలూ, కుక్కల ఓనర్లూ, తన క్యూటీ చుట్టూ తిరుగుతూ "నువ్వు గొడ్రాలివి. నువ్వు గొడ్రాలివి" అంటున్నట్లు కలలు. పోనీ ఈ సొసైటీ అవసరానికి ఎప్పుడైనా పనికొస్తుందా? పక్క వీధిలో ఎవడికో కరోనాట. వాడి ఇంటికెళ్ళి పాలుపోసేవాడిని ఈ వీధికి రానీకండి. అసలు వాళ్ళింటికి వెళ్ళి ఎవరూ ఆహార పదార్థాలు అందిస్తున్నా, ఈ వీధిలోంచి వారిని కూడా వెలేయండి" ఇలా వుంటుంది. అంతేకానీ, మనం జాగ్రత్తలు తీసుకుంటూ, వారికి కనీసం ఆహారం ఏర్పాటు చేద్దాం అన్న కనీసపు మానవత్వం వుండదు. ఇలాగే మన పారిశుధ్య కార్మికులూ, డాక్టర్లూ, నర్సులూ, పోలీసులూ అనుకుంటే ఇంకా ఎంత భయంకరంగా కరోనా వాత పడేవారో ప్రజలు.


ఇంక ఈ సొసైటీ అన్నది హైక్లాసు వారికి మాత్రమే అనుకుంటున్నారా? లేదు పేవ్‌మెంట్ మీద పడుకునే బిచ్చగాడికి సైతం, అతని సొసైటీ అతనికి వుంటుంది. "నేను గుడి మొదటి మెట్టుమీద కూర్చుని అడుక్కునేవాడిని. ఆఖరి మెట్టు మీద కూర్చుని అడుక్కునే వాడి పిల్లని ఎలా చేసుకుంటాను? మా బంధువులకి ఏం జవాబు చెప్పుకోవాలి?" అంటాడు. అసలు వాళ్ళల్లో ఈ పెళ్ళిళ్ళులాంటివి వుంటే.

మా డ్రైవర్ "మా మందిలో పిల్లోడి తల వెంట్రుకలు ఇప్పిస్తే 'ఏట'ని కోసి దావాత్ చెయ్యాలి "ఒడి బియ్యం పోస్తే దగ్గర దగ్గర రెండు మేకలు కొయ్యాల" అంటాడు. డబ్బులు లేవు అని రోజూ అంటూనే వుంటాడు. "ఓ పదివేలు సర్దు మేడం, సొంతోళ్ళ తాన పరువు పోతది, మా మామ సంతం బావమరిది బిడ్డ ఆడబిడ్డ పెళ్ళికి పోయిరావాల నిజాంబాద్" అంటాడు. 'సంతం' అనే మాట ఎక్కడో అక్కడ పెడ్తాడు మనని ఒప్పించడానికి.

"మా వీధిలనే చివర సంతం మా ఇంటి ఓనర్ షడ్డకుడి కూతురి పెళ్ళి శలవు కావల" అంటాడు. వీడి 'సంతం' తగలెయ్యా World bank ముందు వీడి తాత అడుక్కున్నా మా తాత అడుక్కునే సంతం World bank అనగలడు" అంటారు మా వారు.

అతని సొసైటీ అతనికుంటుంది. ఆదుకోడానికి కాదు. అనడానికి. సో.. నేనేం అంటానంటే ఏమీ అనను. సొసైటీలో వుంటున్నాం కదా. ఏమంటే సొసైటీ ఏం అనుకుంటుందో? ఇంతకీ ఈ సొసైటీ ఎవరండీ? అదిగో ఫోన్ చేస్తోంది. పక్క ఫ్లాట్ నుండి.

Post your comments










https://www.youtube.com/watch?v=ERaaX_IulS4